శ్రీరామచంద్రుడికి పట్టాభిషేకం జరిగింది.

అయోధ్య నగరమంతా ఆనందకోలాహలంగా ఉంది. ఇంటింటా దీపాల తోరణాలు... వెలుగుల పరవళ్ళు... అంబరాన్ని అంటుతున్న సంబరాలు... సరదాలు... నృత్యాలు... గానాలు.... హాస్యాలు... హాసాలు... పరిహాసాలు... వినోదాలు... విందులు...

''నాయనా! రామరాజ్యం వచ్చిందని పండగ చేసుకుంటూ సంబరపడి పోతుంటే ... నువ్వెందుకూ దిగులుగా ఉన్నావు?'' మృదువుగా అడిగాడు కుల గురువైన వశిష్ఠ మహర్షి.

# కరుణించవా... శివా!

**- డి. శ్రీనివాస దీక్షితులు**

''గురువర్యా! నా మనసెందుచేతనో ఈ ఆనంద సమయాన వికలంగా ఉంది. రావణుని వధించిన మరుక్షణం నుంచి నాకిలాగే ఉంది!'' విచారంగా అన్నాడు శ్రీరాముడు.

''అలాగా!'' అని వశిష్ఠ మహర్షి కళ్ళు మూసుకుని దివ్యదృష్టితో చూశాడు.

''రామచంద్రా! పులస్త్యబ్రహ్మ వంశంలో పుట్టిన రావణుని వధించటం వల్ల నీకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. ప్రస్తుతం నువ్వనుభవిస్తున్న ఈ మానసిక అశాంతికి అదే కారణం!'' వివరించాడు మహర్షి.

''ఈ పాపానికి పరిహారం లేదా?''

''లేకేమి... ఉంది!''

''అదేమిటో సెలవియ్యండి మహర్షీ!''

''నువ్వు లంకకి వెళ్ళటానికి వారధి కట్టినచోట సముద్ర తీరంలో ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లయితే ఈ బ్రహ్మహత్యాపాతకం నుంచి నీకు విముక్తి కలుగుతుంది'' చెప్పాడు వశిష్ఠ మహర్షి.

మరునాడు అయోధ్య నుండి బయల్దేరి సముద్ర తీరానికి చేరుకున్నాడు... సపరివారంగ శ్రీరాముడు. అక్కడ వశిష్ఠ మహర్షి పర్యవేక్షణలో శ్రీరాముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడు.

''ఈ ప్రదేశం నేటినుండి ''రామేశ్వరం''గా ప్రసిద్ధి చెందుతుంది'' అన్నాడు వశిష్ఠ మహర్షి.

''గురువర్యా! ఇక నేను బ్రహ్మహత్యా పాతకం నుంచి విముక్తి పొందినట్లే కదా!'' అడిగాడు శ్రీరాముడు.

''పొందినట్లే.... కానీ....''

''ఏమిటో సెలవియ్యండి మహర్షీ''.

''రావణుడు గొప్ప శివభక్తుడు కూడా కావటం చేత ఆ పాతకం నుంచి నీకింకా పూర్తిగా విముక్తి లభించలేదు'' అరకొరగా ఇంకా ఆ పాపఫలం మిగిలే ఉంది''.

''అయితే... నేనింకా ఏం చెయ్యాలి?''

''శివదర్శనం వల్లనే నీకు ఆ పాతకం నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుంది''.

''శివదర్శనమా?'' అని ఆలోచనలో పడ్డాడు శ్రీరాముడు.

అప్పుడే హరినామస్మరణం చేసుకుంటూ నారద మహర్షి అక్కడికి వచ్చాడు. అందరూ ఆయనకి నమస్కరించారు.

''శ్రీరామచంద్రా! ఏదో సమస్యలో...'' అడిగాడు నారదుడు.

''అవును నారదా! ఒక సమస్య ఎదురయింది.... పరిష్కారమార్గం కనిపించటం లేదు'' అన్నాడు శ్రీరాముడు.

''అయోధ్యా నగరానికి వెళ్ళాను. మీరిక్కడికి వచ్చారని తెలిసి....''

''రావణుని వధించటం వల్ల కలిగిన బ్రహ్మహత్యా పాతకాన్ని పోగొట్టుకోవటానికి కులగురువుల పర్యవేక్షణలోనే ఇక్కడ శివలింగ ప్రతిష్ఠ చేశాను. అయినా... ఆ పాతకం ఇంకా కొంత మిగిలే ఉంది''.

''మరి.... ఆ కొంత పోయే మార్గం లేదా?''

''ఉంది!''

''ఏమిటది?''

''శివదర్శనం''

''అయితే.... నీ పాతకం పోయినట్టే రఘుకుల తిలకా!''

''అదేమిటీ.... అంత తేలికా శివదర్శనం?''

''ఇప్పుడు శివదర్శనం సులభ సాధ్యమే!''

''సులభ సాధ్యమా? ఎలా?''

''తనకంటే ముందుగా గణపతికి వివాహం చేసారని అలిగి కుమారస్వామి కైలాసం నుంచి భూలోకానికి వచ్చాడు కదా! అప్పటినుంచి తన కుమారుని అలక తీర్చటానికి పరమేశ్వరుడు కూడా ఇక్కడే ఉండిపోయాడు.'' అని చెప్పాడు నారద మహర్షి.

వెంటనే శ్రీరామచంద్రుడు తన పరివారాన్నీ, వశిష్ఠ మహర్షినీ అయోధ్యా నగరానికి వెళ్ళమని చెప్పి తాను ఒంటరిగా శ్రీ పర్వతానికి బయల్దేరాడు.

శ్రీరాముని కంటే ముందుగా రామేశ్వరం నుంచి బయల్దేరి నారద మహర్షి శ్రీ పర్వతానికి చేరుకున్నాడు.... పరమేశ్వరుని దగ్గరికి వెళ్ళాడు.

''పరమేశ్వరా! నీ పరమభక్తుడైన రావణుని చంపిన శ్రీరాముడు నిన్ను దర్శించటానికి ఇక్కడికి వస్తున్నాడు. రావణుని వధించటం వల్ల చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టుకునేందుకే వస్తున్నాడు కానీ నీ మీద భక్తితో కాదు!'' అని పరమేశ్వరునికి చెప్పాడు నారదుడు.

''నేనిక్కడున్నానని ఆయన కెవరు చెప్పారు?''

''ఎవడో నాలాంటి వాడే చెప్పి ఉంటాడు. అయినా... ఆ విషయం తెలుసుకోవటం వల్ల నీకేమీ ప్రయోజనం?'' అన్నాడు నారదుడు.

''ఊరికే అడిగాను... దానివల్ల నాకేం ప్రయోజనం? నా సంగతి చెప్పిన వాడెవడో తెలుసుకుందామని''.

''వాడిసంగతి మనకెందుకు కానీ... ముందు శ్రీరాముడి విషయం ఆలోచించు''.

''ఆలోచించటానికి కేముందీ?''

''అదేమీ? ఆలోచించటానికేమీ లేదా?''

''ఉంది.... ఉంది! నా భక్తాగ్రగణ్యుడైన రావణుని వధించి శ్రీరాముడు నాకు అమితమైన మనస్తాపం కలిగించాడు. మహాపచారం చేశాడు''.

''నిజమేకదా!''

''అందుకే... అతనికి నేను దర్శనమివ్వను... ఇవ్వను గాక ఇవ్వను!''

''అతని మీద నీకంత కోపమా?''

''ఆc కోపమే!''

''సముద్రతీరంలో శివలింగ ప్రతిష్ఠ చేసాడు కదా! అయినా... కోపమెందుకో?''

''నేను భక్తపక్షపాతిని. నా పరమభక్తుణ్ణి చంపితే నాకు కోపం రాదా?''

''నీ భక్తుడు తప్పుచేసాడు. అందుకే రాజధర్మంగా శ్రీరాముడు అతణ్ణి శిక్షించాడనుకోవచ్చు కదా!''

''శిక్షించటం వేరు... వధించటం వేరు! శిక్షించి ఊరుకుంటే నాకతని మీద కోపం వచ్చేది కాదు!''

''రావణుణ్ణి వధించకుండా సమస్యని పరిష్కరించేందుకు శ్రీరాముడు రాయబారుల్ని పంపాడు. రావణుడు లొంగలేదు. ఇక తప్పని పరిస్థితిలో శ్రీరాముడు యుద్ధం చేసి నీ భక్త శిఖామణిని వధించాడు. ఏ విధంగా చూసినా శ్రీరాముడిది ధర్మంగానే అనిపిస్తోంది''.

శివుడు మౌనముద్ర దాల్చాడు.

ఇంతలో వారికి దూరాన్నుంచి ఎవరో మనిషి వస్తున్న అలికిడి వినిపించింది. నడుస్తుంటే కాళ్ళకింద పడి నలిగిన ఎండుటాకుల గలగల ధ్వని....

ఆ ధ్వని వినిపించిన వైపు చూశాడు నారదుడు.

దూరంగా.... శివుణ్ణి వెదుకుతూ వస్తున్న శ్రీరాముడు కనిపించాడు.

''పరమేశ్వరా! అదుగో నిన్ను వెదుకుతూ శ్రీరాముడు ఇటే వస్తున్నాడు. నువ్వెక్కడైనా దాక్కుంటే....''

''ఎక్కడ దాక్కోవాలో చెప్పవయ్యా నారదా!''

''నాకీ ప్రదేశం కొత్త... నాకు తెలియదు స్వామీ!'' అని మెల్లగా అక్కడి నుంచి జారుకుని... హరినామస్మరణం చేస్తూ శ్రీరాముని చేరుకున్నాడు నారదుడు.

''శ్రీరామచంద్రా! వచ్చావా?'' అడిగాడు నమస్కరించి నారదుడు.

''నువ్వే చెప్పావుకదా! శివుడు ఇక్కడున్నాడని. అందుకే వచ్చానిక్కడికి'' అన్నాడు శ్రీరాముడు.

''ఆ మాట బిగ్గరగా అనకు స్వామి! శివుడు వింటే పెద్దతంటా'' అన్నాడు నారదుడు.

''నువ్వు చెప్పినమాట నిజమే కదా!'' లోగొంతుకతో అడిగాడు రాముడు.

''నేను నీకు చెప్పినట్టు తెలిస్తే... అసలే ఆయన ముక్కోపి... ఫాలాక్షుడు''

''సరే.... చెప్పనులే! శివుడెక్కడున్నాడో చెప్పు!''

''ఇంకెక్కడ.... ఇక్కడే స్వామీ!''.



"ఇక్కడ అంటే ఎక్కడా?"

"అదుగో... అటు చూడు... ఎత్తుగా ఒక శిఖరం కనిపిస్తోందా?"

"ఆఁ ఆఁ కనిపిస్తోంది!"

"ఆ శిఖరానికి దిగువన ఇరుకైనా దారి ఉంది. కింది నుంచి పైకి ఎక్కటానికీ... పై నుంచి కిందికి దిగటానికీ వీలులేకుండా ఉన్నదారి అది. ఆ దారి గుండా జాగ్రత్తగా కిందికి దిగితే సమతల ప్రదేశం కనిపిస్తుంది. అక్కడికి ఒక జలపాతం వచ్చి పడుతూ ఉంటుంది. అక్కడ ప్రకృతి పచ్చగా.... చల్లగా.... నయనానందకరంగా ఉంటుంది. జలపాతం కిందికి పడిన చోట చిన్నకొలను ఏర్పడింది. ఆ కొలనుని ఆనుకుని చిన్నగుహ ఉంది. నీకు కనపడకూడదనే ఉద్దేశంతోనే శివుడు ఆ గుహలో దాగి కాలం గడుపుతున్నాడు.

"అలాగా!"

"రామచంద్రా! ఇక నేను వెళ్ళిరానా?" అన్నాడు నారద మహర్షి తప్పించుకుని పోయేందుకు.

కానీ... శ్రీరాముడు ఆయన్ని వదల్లేదు.

"అలా కుదరదు నారదమహర్షీ! నువ్వు కాక నాకింకెవరున్నారిక్కడ చెప్పు! నువ్వు నా శ్రేయోభిలాషివి కనుక ఇంత శ్రమపడి నాకు దారి చూపించావు. మిగిలిన పుణ్యం కూడా నువ్వే కట్టుకో. నువ్వే దగ్గరుండి శివదర్శనం చేయించి పెడితే బాగుంటుంది. నా మాట కాదనకు" అన్నాడు బతిమాలుతున్న ధోరణిలో శ్రీరాముడు.

"రామచంద్రా! నాకు పెద్దబాధ్యత అప్పగించావ్! ముందు చూస్తే నుయ్యి వెనక చూస్తే గొయ్యిగా ఉంది నా పరిస్థితి".

"అంత కష్టమేమి వచ్చిపడింది నీకు నారదా!" అమాయకంగా అడిగాడు శ్రీరాముడు.

"మామూలు కష్టం కాదు... మహాకష్టం! నీ మాటని కాదనలేక నీకు దారి చూపిస్తూ నీతో కలిసి ఉన్నాననుకో... అదీ ఆయన చూసాడనుకో..."

"ఆఁ చూస్తే ఏమౌతుంది?"

"ఏమౌతుందా? గట్టున కూచుని ఎన్ని మాటలైనా చెప్పవచ్చు స్వామి! దిగితే కదా లోతు తెలిసేది. ఆయన అసలే ముక్కోపి... ముక్కంటి... మూడో కన్ను తెరిచాడనుకో ఎప్పుడూ ముల్లోకాలూ తిరుగుతూ హరినామస్మరణం చేసే నారదుడు ఉండడు!"

"అలా అశుభం పలకకూడదు నారదా!"

"అందుకే అడుగుతున్నాను... అశుభం జరగకూడదనుకుంటే నన్ను వదిలిపెట్టు స్వామీ!"

"నారదా! నా మీద ఆన. నువ్వు నాకు శివదర్శనం చేయించిన తర్వాతే వెళ్ళాలి. అంతే!"

"అయితే... ఒక నియమం నేను నీ వెనకే ఉండి ఆయనకి కనిపించకుండా దారి చూపిస్తాను"

"అలాగే నీ ఇష్టప్రకారమే చెయ్యవయ్యా. నాకు కావలసింది శివదర్శనం".

నారదుడు దారి చూపిస్తుంటే శ్రీరాముడు ఎంతో కష్టపడి గిరి శిఖరానికి చేరుకున్నాడు.

శిఖరం అంచున నిలబడి కిందికి చూసాడు రామచంద్రుడు. ఆ పచ్చని ప్రకృతిని చూడగానే ఆయనకి పంచవటి గుర్తుకొచ్చింది.

"ఆహా! ఎంత బాగుందీ ప్రదేశం. రకరకాల మూలికల వాసనలు గుప్పుమంటున్నాయి.... సుమ సౌరభాలు మనసున మల్లెల మాలలూగిస్తున్నాయి... సెలయేటి తుంపరులతో కలిసి వీస్తున్న మందమారుతం చల్లగా హాయిగా ఉంది... శ్రమనంతా పోగొడుతుంది.... అందుకే ఇక్కడుంటున్నాడు శివుడు. అవునా... శివుడేడీ? కనిపించటం లేదే!" అంటూ ఆతృతగా కళ్ళతోనే వెదుకుతున్నాడు శ్రీరాముడు.

"ఆరుబయట ఎందుకుంటాడు ఆయన?" అన్నాడు నారదుడు.

"గుహలో దాగి ఉంటాడు"

"ఈ మండుటెండలో గుహలోనే?"

"అవును! నీకు కనిపించకుండా ఉండటం కోసం ఈ తిప్పలన్నీ".

"కైలాసానికి తిరిగి వెళ్ళిపోయాడేమో?"

"వెళ్ళలేదు... నాకు నిశ్చయంగా తెలుసు?"

"గుహలోనే ఉన్నాడంటావా?"

"ఉన్నాడు!"

వాళ్ళిద్దరూ ఇలా మాట్లాడుతుండగానే గ్రీష్మతాపాన్ని భరించలేక గుహ నుంచి బయటికొచ్చి జలపాతం కింద కొలను దగ్గర ఒక రాతి మీద తలవంచుకుని కూర్చున్నాడు శివుడు.

కొండమీద నుంచి జాలువారుతున్న జలపాతాన్ని కాసేపు తదేకంగా చూసాడు శివుడు... కొలనులో వికసించిన తామర పూలని చూసాడు... నీటి అడుగు నుంచి పైకి వస్తున్న చేపపిల్లల్ని చూసాడు.... వాటిని చూడగానే ఆయనకి పార్వతి కళ్ళు గుర్తుకొచ్చాయి.

ఒక్కసారి తలని ఆడించాడు... జటాజూటాన్ని విదిలించాడు... గంగమ్మ గజగజలాడింది.... నెలవంక ముడుచుక్కూర్చుంది... నాగన్న తలవాల్చి బిత్తరచూపులు చూసాడు.

లేచి అటూ ఇటూ తిరిగాడు. మళ్ళీ రాతి మీద కూర్చున్నాడు.

"నారదా! నారదా! అడుగో శివుడు... కొలను దగ్గర వచ్చి కూర్చున్నాడు".

"బిగ్గరగా మాట్లాడకు రామచంద్రా! శివుడు మళ్ళీ గుహలోకి వెళ్ళిపోగలడు".

"అలాగేలే!"

"ఆయన మొహం చూడు"

"ఎలా చూడనూ? తలవంచుకుని కూర్చున్నాడు"

"అయితే... కొంచెం ముందుకి వంగి చూడు"

శ్రీరాముడు అలాగే చూసాడు.

నీడపై నుంచి తన ముందు పడేసరికి ఆ నీడ శ్రీరామునిదని గ్రహించి శివుడు లేచి తన మొహం కనిపించకుండా లోయలోకి దిగుతున్నాడు.

శిఖరం మీద నుంచే చూస్తూ "నన్ను కరుణించవా శివా! నా పాతకాన్ని పోగొట్టవా? నాకు నీ దర్శన భాగ్యం కలిగించవా?" అంటూ శివుణ్ణి బిగ్గరగా పిలుస్తున్నాడు శ్రీరాముడు.

రాముని పిలుపువింటూనే శివుడు హఠాత్తుగా ఆగిపోయాడు... ధవళ కాంతిపుంజంగా మారిపోయాడు.

కోటి మెరుపుతీగల ఆ కాంతిపుంజం మెల్లగా సూర్య కాంతి వలయంగా రూపుదిద్దుకుంది.... అంతలోనే ఆ కాంతివలయం పండు వెన్నెలగా మారిపోయింది....

చల్లని ఆ వెన్నెల వెలుగులోంచి లింగాకారం దర్శనమిచ్చింది.

శిఖరం మీద నుంచే శ్రీరాముడు నమస్కరించాడు.

*